క్లుప్తంగా

కనిమెట్ట వాసికి సేవాభూషణ్ అవార్డు



కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో మోహన్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన బీమా ప్రభాకర్‌శెట్టికి సేవాభూషణ్ అవార్డు వరించింది. డాక్టర్ ముదిగొండ శివప్రసాద్, దైవజ్ఞశర్మ, శాస్త్రి చేతుల మీదుగా ఈ అవార్డును బీమా ప్రభాకర్‌శెట్టి అందుకున్నారు. గత 30ఏళ్లుగా దివ్యాంగుల సంఘాల్లో చైతన్యస్ఫూర్తి నింపుతూ, సహాయ సహకారాలు అందించి, సేవా కార్యక్రమాలు కొనసాగించినందుకు ఈ గౌరవం లభించిందని, సేవా భూషణ్ అవార్డు అందుకోవడం గర్వకారణంగా ఉందని బీమా ప్రభాకర్ శెట్టి పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తకోట రూరల్: రైతుబీమా దరఖాస్తుల కోసం 18నుంచి59 ఏళ్ల ఉన్న వారు 2025 ఆగస్టు 13వ తేదీలోగా ఏఈఓని కలిసి ఫారం అందజేయాలని ఏడీఏ దామోదర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతుబీమా ఫారం, పట్టా పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో పట్టాదారు రైతువేదికలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతుబీమాలో నామిని చనిపోయిన, పట్టాదారు పేర్లు, తప్పులు ఉన్న, సవరణకు ఈనెల 12వ తేదీవరకు అవకాశం ఉందన్నారు.

చేపపిల్లల ఉత్పత్తి దారులను ఆదుకోవాలి

ఆత్మకూర్: చేపపిల్లల ఉత్పత్తి దారులను గత ప్రభుత్వం మోసం చేసిందని సరఫరాకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులఊబిలో కూరుకుపోయామని ఉత్పత్తి దారుడు ఏటికాడి ఆనంద్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం ప్రభుత్వ ఆదేశాలతో చేప పిల్లలను సరఫరా చేశామని, తనకు రూ.40 లక్షలు బిల్లులు రావల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తనతోపాటు మిగితా ఉత్పత్తిదారులు తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసాను ఇచ్చినట్లు తెలిపారు.

రైతులకు సరిపడా యూరియా

ఆత్మకూర్: ప్రస్తుత వర్షాకాల పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో వినయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో అగ్రో రైతుసేవా కేంద్రం, హాకా రైతుసేవా కేంద్రం, పీఏసీఎస్ ఆత్మకూర్, ప్రాథమిక సహకార సంఘం రేచింతలలో యూరియా సిద్ధంగా ఉందని వివరించారు. ప్రస్తుత పంటలకు నానో యూరియాను వినియోగించవచ్చని సుమారు 60 మెట్రిక్ టన్నులకు పైగా యూరియా అందుబాటులో ఉందని వెల్లడించారు. మండలంలోని రైతులు ప్రస్తుత దశకు కావల్సిన ఎరువులను మాత్రమే తీసుకోవాలని, కేంద్రాలను సంప్రదించి నిర్దేశిత విధానాల ప్రకారం యూరియాను పొందాలని సూచించారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గం



కొత్తకోట రూరల్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ శనివారం పెబ్బేరు మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య ఆధ్వర్యంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలి ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షురాలిగా కొత్తకోట పట్టణానికి చెందిన భీమ ప్రసన్నలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మంజులను ఎంపిక చేశారు. మాజీ జిల్లా అధ్యక్షుడు భీమ ప్రభాకర్, కొత్తకోట పట్టణ సంఘం అధ్యక్షుడు భీమ చంద్రకాంత్ సూచనమేరకు ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా భీమ బాలకృష్ణను నియమించారు. కార్యక్రమంలో బాలీశ్వరయ్య, బాలరాజు, రమేశ్‌శెట్టి, జయప్రకాష్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అనుబంధాల రాఖీ



మదనాపురంలో రాఖీ కడుతున్న చెల్లెలు



ఆత్మకూర్‌లో సోదరులకు రాఖీలు కడుతున్న సోదరి



వనపర్తిలోబాలుడికి రాఖీలు కడుతున్న అక్కలు



కొత్తకోటలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లి

సోదరులు, సోదరిమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వయస్సుతో సంబంధం లేకుండా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి వారిపై తమకున్న ప్రేమను, ఆప్యాయతను తెలిపారు. ఈ సందర్భంగా ఒకరికొకరం బాసటగా ఉంటామని భరోసానిమ్చుకున్నారు. ఆడపడచుల రాకతో పండుగ వాతావరణం కనిపించింది.

– సాక్షి, నెట్‌వర్క్



ఖిల్లాఘనపురం కేజీబీవీలో రాఖీ సంబరాలను నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు



వడ్డెవాట గ్రామంలో యుగంధర్‌గౌడ్ రాఖీ కడుతున్న సోదరి



పాన్‌గల్‌లో సోదరునికి రాఖీ కడుతున్న చెల్లి



వీపనగండ్లలో అన్న మోక్షజ్ఞకు ఆప్యాయంగా రాఖీ కడుతున్న చెల్లెలు హర్షిత



పాన్‌గల్‌లో సోదరునికి రాఖీ కడుతున్న సోదరీ



ఆత్మకూర్‌లో సీఐ శివకుమార్‌కు రాఖీ కడుతున్న ఎస్సై హిమబిందు రాథోడ్



అమరచింతలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు



కొత్తకోటలో వృద్ధుడైన అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు

సెల్ఫీ విత్ 'సాక్షి'కి స్పందన



శాన్వి, వనపర్తి



దక్షిత, వనపర్తి



మందాపురంలో

తూములకు లాకులు ఏర్పాటు చేయాలి



నాగులకుంట నుంచి వృథాగా బయటకు పోతున్న సాగునీరు

అమరచింత: పట్టణ శివారులోని నాగులకుంట, అనాయి కుంటకు ఇరిగేషన్ అధికారులు తూములకు లాకులను ఏర్పాటు చేయాలని కుంటకింది ఆయకట్టు రైతులు కోరుతున్నారు. భూత్పూరు రిజర్వాయర్ నుంచి సాగునీరు కుంటలోకి వచ్చి చేరుతున్న నీటిని నిలువరించలేని స్థితిలో ఇరిగేషన్ అధికారులు ఉన్నారన్నారు. నాగులకుంట తూంలు సైతం లేవని దీంతో వచ్చిన నీరంతా వృథా టగా పొలాల్లోంచి ముందుకెళ్లడంతో పంట దెబ్బతింటున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి లాకులను బిగించాలని కోరుతున్నారు.

గిరిజన హక్కుల సాధనకు ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

పాన్‌గల్: గిరిజన హక్కుల సాధనకు కలిసికట్టుగా గిరిజనులు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్, జిల్లా అధ్యక్షుడు చంద్రూనాయక్, సోమ్‌నాథ్‌నాయక్ అన్నారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా శనివారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంఘం ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పాటు వారికి కల్పించిన హక్కులను కాలరాస్తుందన్నారు. గిరిజన సంక్షేమ పథకాలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, సబ్‌ప్లాన్ చట్టం వంటి వాటిని అమలుచేయడం లేదని వారు విమర్శించారు. అంతకు ముందు తెల్లరాళ్ళపల్లితండా, పాన్‌గల్‌లో ర్యాలీలను నిర్వహించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి..

మండలంలోని కిష్టాపూర్‌తండాలో గిరిజన రైతులపై అటవీశాఖ అధికారులు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. పోడు భూములు సాగుచేసుకుంటున్న రైతులకు పట్టదారు పాసుపుస్తకాలు ఉన్న వారు సాగుచేసుకుంటున్న భూముల్లో చెట్ల నరికివేశారని అటవీశాఖ అధికారులు కేసులు పెట్టడం సరికాదన్నారు. అధికారులు స్పందించి కేసులు ఎత్తివేయకుంటే గిరిజనులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాంబాబు, సోమ్లునాయక్, చిట్టెమ్మ, సీతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా బోడ గుండయ్య ఉత్సవం



ఎడ్లబండ్లతో ఉత్సవాలకు వెళ్తున్న గ్రామస్థులు

వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో గుట్టపై వెలసిన బోడ గుండయ్య ఉత్సవాలను శనివారం మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు, గ్రామస్థులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రతి ఏటా ఈ ఆలయానికి వెళ్లి బండరాలపై బెల్లంతో తయారు చేసిన పానకాన్ని వరదపాయసంగా పోయడం ఇక్కడ ఆనవాయితి. ఎడ్లబండ్లతో పాటు, పూనకం వచ్చిన శివసత్తులు డప్పుమేళాలతో ఊరేగింపు నిర్వహించి గంగమ్మతల్లి ఆలయానికి చేరుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. గ్రామరైతు కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదానికి అడ్డుకట్ట



హెల్మెట్‌పై అవగాహన కల్పించి రాఖీలు కడుతున్న మహిళా పోలీసులు

వనపర్తి: వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సీఐ కృష్ణ అన్నారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశానుసారం శనివారం పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో హెల్మెంట్ ధరించడంపై అవగాహన్న కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వాహనదారులకు మహిళా కానిస్టేబుళ్లు మరియు ట్రాఫిక్ కానిస్టేబుళ్ళతో రాఖీలను కట్టీ పువ్వులను స్వీట్లు పంచుతూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడమే కాకుండా నిబంధనలు పాటించే వారిని గౌరవిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యత అని, సమిష్టి కృషితోనే ప్రమాదాలను నివారించ వచ్చన్నారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్ , మహిళ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు వితరణ



ఇత్తడి తొడుగును అందజేస్తున్న వనజమ్మ

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో శ్రీకృష్ణ ఆలయంలోని ధ్వజ స్తంభానికి కొత్తూర్ రాంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి కొత్తూర్ వనజ రూ.2.20లక్షల విలువ గల ఇత్తడి తొడుగును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. గతంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ.2.70 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వనజమ్మను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మెన్ బీసం చెన్నకేశవరెడ్డి, తిమ్మన్నయాదవ్, ముంత సత్యం యాదవ్, న్యాయవాది రాములుయాదవ్, మాజీ కౌన్సిలర్స్ రాములు యాదవ్, మన్యంయాదవ్, బాలకొండయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకున్నది. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపూర్‌కు చెందిన రాములమ్మ, నర్సింహ ద్విచక్ర వాహనంపై రెండోకేంద్రం నాగరాల గ్రామానికి వెళ్తున్నారు. రాయినిపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీ కొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడ్డారన్నారు. రాములమ్మకు చెయ్యికి గాయాలు కాగా, నర్సింహ తలకు బలమైన గాయాలు తగిలాయి. వెంటనే వారిని అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నర్సింహకు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

వనపర్తి రూరల్: మండలంలోని శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఓ మహిళ కనిపించడం లేదని ఆమె సోదరుడు అంగోతు శ్రీను శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శ్రీనివాసపురం బోనమ్మతండాకు చెందిన అంగోతు సిరోలి (22) శుక్రవారం మధ్యాహ్నం నాగర్‌కర్నూల్‌లో పరీక్ష ఉందని ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమెకు ఫోన్ చేయగా ఫోన్‌స్విచ్చాఫ్ అని రావడంతో సోదరుడు శ్రీను శనివారం పోలీసులకు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి



కేంద్ర పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూర్: పీఎం నరేంద్రమోదితోనే దేశాభివృద్ధి సాధ్యమైందని గడప గడపకు కేంద్రప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్రనాయకుడు కంభంపురం రాము, మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్, నియోజకవర్గ కన్వీనర్ రేచింతల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని మేడేపల్లి, జూరాల గ్రామాల్లో సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తు కరపత్రాలను అందజేశారు. ప్రతి ప్రభుత్వ పథకంలో కేంద్రం వాట ఉందని రాష్ట్ర ప్రభుత్వం తామే చేస్తున్నామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్‌గౌడ్, రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, సహదేవుడు, సాయి, నరేష్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి దేవి ఉత్సవాలు



బోనాలతో ఆలయం దగ్గరికి వచ్చిన భక్తులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంవలోని సొడమ్మ గుట్టన ఉన్న చౌడేశ్వరి దేవి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన తొగడవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. గ్రామంలో మహిళలు ప్రత్యేకంగా కుంకుమ, పసుపు, పూలు తదితర వాటితో ఎంతో అందంగా అలంకరించిన బోనంలో అమ్మవారి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, చంద్రయ్య వెంకటయ్య, ప్రసాద్, తిరుపతి, శంకర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు



ప్రభోత్సవంలో పాల్గొన్న పద్మశాలి కులస్థులు

అమరచింత: పట్టణంలోని పద్మశాలి కులస్థులు శనివారం నూలు పున్నమి పర్వదినంను ఘనంగా నిర్వహించారు. భక్త మార్కెండేయ ఆలయంలో పద్మశాలి కులస్థులు ప్రత్యేక పూజలను చేశారు. సాయంత్రం ప్రభోత్సవంను నిర్వహించి మార్కెండేయున్ని ఊరేగించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ.. అనాదిగా తమ పెద్దలు రాఖీ పౌర్ణమి రోజున నూలు పుట్టిన రోజును భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అనాదిగా వస్తున్న అనావాయితని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహంకాళి విష్ణు, మహంకాళి ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న, పొరుపల్లి చింతన్న, శ్రీనివాసులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

నాగదేవతలకు పూజలు



నైవేధ్యాన్ని సమర్పిస్తున్న మహిళలు

వీపనగండ్ల: శ్రావణ పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మహిళలు నాగదేవతలకు భక్తిశ్రద్ధలతో పాలు, నూగుల ముద్దలతో నైవేద్యాన్ని సమర్పించారు. దీంతో రైతులు, మహిళలు, పొలం పనులతో పాటు ఇతర పనుల్లో నిమగ్నమయ్యే సమయంలో నాగదేవతల అనుగ్రహం ఉంటుందని, దీంతో ఎలాంటి ఆపదలు రావని మహిళల నమ్మకం. మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వెలసిన నాగదేవలతకు పలువురు మహిళలు భక్తితో నైవేద్యాలను సమర్పించారు.

నిలిచిన వాహనాలు.. ప్రయాణికులకు ఇబ్బందులు



కిష్టారెడ్డిపేట దగ్గర ఇరువైపులా నిలిచిన వాహనాలు

వనపర్తి రూరల్: శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెబ్బేరు మండలంలోని కిష్టారెడ్డిపేట దగ్గర వాగులపై వంతెన నిర్మాణ పనులు జరుగుతుండడంతో పక్కన తాత్కాలికంగా మట్టి రోడ్డును నిర్మించారు. రోడ్డుపై నీల్లు ప్రవహించి రోడ్డు పూర్తిగా కోతకు గురై ప్రమాదకరంగా మారడంతో శనివారం ఉదయం రోడ్డుకు ఇరువైపులా వాహనాల నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు అక్కడి చేరుకొని నీటి ఉధృతి తగ్గిన తర్వాత వాహనాలను పంపించారు.

చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణలు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలతో పాటు ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాల ఆవరణలు రెండురోజులుగా కురుస్తున్న వర్షప నీటితో చెరువును తలపిస్తున్నాయి. పాఠశాలలు ఒకే ఆవరణలో ఉండటం వల్ల వర్షపునీరు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొన్నది. నీరునిల్వ ఉండకుండా చేసేందుకు అ వసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రు లు అధికారులకు విన్నవించిన స్పందించడం లేదని అధికారులు స్పందించి ఇబ్బందులు కలగకుండా గ్రామస్థులు కోరుతున్నారు.



వీపనగండ్ల బాలికల ఉన్నత పాఠశాలలో